సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం ; 8 ; జూన్ ; 2024



కడలిని కాపాడుకుందాం

మానవుడి స్వార్థం కడలిని కబళిస్తోంది. ఇష్టానుసారం వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టడంతో జీవజాతి ముప్పు ఎదుర్కొంటోంది. 8లో ▸



ఆదమరిస్తే కాటేస్తాయ్ !

వర్షాకాలం ప్రారంభం కావడంతో పాముల బెడద ఎక్కువగా ఉంది. ముఖ్యంగా అటవీ ప్రాంతంలో తరచూ పాములు కనిపిస్తున్నాయి. 8లో ▸



ఐసీఏఆర్‌కు నివేదిక

జీడిమామిడిపై 2018 నుంచి 2023 వరకు జరిగిన పరిశోధనల వివరాలను ఉద్యాన వర్సిటీ వీసీ జానకీరామ్ ఢిల్లీలో సమర్పించారు. 8లో ▸

న్యూస్‌రీల్

పార్టీ కేడర్‌కు అండగా ఉంటా



గూడూరి ఉమాబాల

భీమవరం: నరసాపురం పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికలు సందర్భంగా తనకు సహకరించిన వారందరికీ వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు సీటు ఇచ్చి ప్రోత్సహించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో తన వెన్నంటి ఉండి అహర్నిశలు పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తనకు ఓట్లు వేసిన సుమారు 4.30 లక్షల మంది ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఓటమి చవిచూసినా నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అలాగే పార్టీ కేడర్‌కు అండగా ఉంటానని ఉమాబాల చెప్పారు.

జిల్లా అధ్యక్షుడిగా అల్లాడ



సూర్యభాస్కరరావు

పెనుగొండ: జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అల్లాడ సూర్య భాస్కరరావును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం పెనుగొండలో అల్లాడ సూర్యభాస్కరరావు మాట్లాడుతూ జిల్లా కమిటీ, అసెంబ్లీ కమిటీలు ఏర్పాటు చేశామని, ప్రజాసమస్యలపై పోరాటాలు చేసి అండగా ఉంటామన్నారు. నివేదికలను రాష్ట్ర, కేంద్ర కమిటీలకు పంపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.


పశువైద్యులకు జాతీయ స్థాయి శిక్షణ



పశువైద్యులతో నరేంద్రనాథ్

తణుకు: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తణుకులోని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ కార్యాలయంలో పశువైద్యులకు జాతీయ స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమైనట్లు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.సూర్యచంద్రరరావు తెలిపారు. పెద్ద, చిన్న పశువుల శస్త్రచికిత్సలకు సంబంధించి మూడ్రోజుల పాటు 8 మందికి, పెద్ద పశువుల పోషణ, శస్త్రచికిత్సలకు సంబంధించి ఐదు రోజుల పాటు 12 మందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. కోర్సు కో–ఆర్డినేటర్లుగా డాక్టర్ ఆర్.శ్రీధర్, డాక్టర్ వై.శ్రీనివాస్‌లు పాల్గొననున్నారు. పశు ఆరోగ్య సంస్థకు పూర్తిస్థాయి వసతులు సమకూర్చడంతోపాటు శిక్షణ తరగతులకు కావాల్సిన సహాయ సహకారాలను ఆంధ్రాసుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, తణుకు వెటర్నరీ ఇనిస్టిట్యూషన్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి ముళ్లపూడి నరేంద్రనాథ్ సమకూర్చారన్నారు.

ఏపీ నిట్‌లో ముగిసిన త్రీడీ ప్రింటింగ్ శిక్షణ



నిట్‌లో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన త్రీడీ ప్రింటింగ్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. దినేష్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో త్రీడీ ప్రింటింగ్ నేర్చుకోవడం అభినందనీయమన్నారు. పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతో పాటు నిత్యం ఏదో కొత్త విషయాన్ని బాల్యం నుంచి నేర్చుకోవాలన్నారు. శిక్షణ పొందిన 44 మందికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కార్తికేయశర్మ, ఆచార్యులు వి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి క్యాంపస్ రిక్రూట్‌మెంట్, జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐటీఐ విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు విద్యార్హత సర్టిఫికెట్ల నకళ్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు సెల్ 9676099988, 8886339666 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సులభంగా పే చేస్తున్నారు

ఆన్‌లైన్ పేమెంట్‌కు సై

- నగదు లావాదేవీలకు క్రమంగా చెల్లుచీటీ
- ఆన్‌లైన్ చెల్లింపులకు చిరు వ్యాపారుల మొగ్గు
- సైకిళ్లు, తోపుడుబండ్ల వ్యాపారులు సైతం వినియోగం
- చిల్లర వెతలకు చెక్
- జిల్లాలో భారీగా నగదు రహిత లావాదేవీలు



తాడేపల్లిగూడెంలో కొబ్బరిబొండాల దుకాణం వద్ద ఆన్‌లైన్ పేమెంట్ చేస్తూ..



పెంటపాడులో చిరు వ్యాపారి వద్ద డిజిటల్ పేమెంట్ క్యూఆర్ కోడ్

సాక్షి, భీమవరం: బయటకు వెళుతున్నారా?.. జేబులో చిల్లిగవ్వ లేకపోయినా ఫర్వాలేదు.. అకౌంట్‌లో సొమ్ములు, చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయొచ్చు.. నచ్చిన ఫుడ్ తినొచ్చు.. గతంలో మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్స్ రానురానూ చిరు వ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండగా.. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే కనిపిస్తున్నాయి.

కోవిడ్ అనంతర పరిణామాలతో..

2016లో రూ.500, రూ.1000 నోట్ల రద్దు తర్వాత ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులను అధిగమించే నిమిత్తం డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించేవారు కాదు. మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు కనిపించేవి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలతో గణనీయమైన మార్పులు వచ్చాయి.

అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులే..

ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే తదితర పేమెంట్ యాప్ సేవలతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జీలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలావరకూ ఈ యాప్ ద్వారానే జరుగుతున్నాయి. పేమెంట్ యాప్‌లు వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరుసలో ఉంటోందని ఆయా సంస్థల ప్రతినిధులు అంటున్నారు.

చిరు వ్యాపారుల చెంతకు..

టీ స్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిళ్లపై రోడ్ల పక్కన, ఇంటింటికీ తిరుగుతూ ఫాస్ట్‌ఫుడ్స్, కూరగాయలు, పండ్లు వంటివి అమ్మే వ్యాపారులకు ఈ ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి బేరాలు పోతుంటాయి. డిజిటల్ పేమెంట్స్ పుణ్యమాని చిల్లర సమస్య తీరుతుండటంతో చిరు వ్యాపారులు సైతం వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు, బోర్డులు దర్శనమిస్తున్నాయి. గతంతో పోలిస్తే చాలా వరకు వినియోగదారులు ఆన్‌లైన్ పేమెంట్ చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారని, వీటి వలన చిల్లర సమస్య ఉండటం లేదని వ్యాపారులు అంటున్నారు.

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు అంతే ఆస్కారం ఉంటుందని నిపుణులు అంటున్నారు. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి అమౌంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుకే అమౌంట్ పే చేసినట్టు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారు ఖాతాకు జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో బయటకు వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు అంటున్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలావరకూ తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ ట్రానాక్షన్లు చేస్తూ ఇంటి వద్ద నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. దీనివలన బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల సంఖ్య తగ్గిందని బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులు అంటున్నారు. మరోపక్క రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. నూరుశాతం డిజిటల్ జిల్లాగా మార్చేందుకు కృషిచేస్తోంది.



సెల్‌ఫోన్‌లకు స్క్రీన్‌గార్డులు వేసే చిరు వ్యాపారి వద్ద..

మొబైల్ ఏటీఎం ప్రారంభం




ఏటీఎంను ప్రారంభిస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో)/ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ఏలూరు సెంట్రల్ కార్యాలయంలో నూతన మొబైల్ డిమోన్‌స్ట్రేషన్ వ్యాన్ (మొబైల్ ఏటీఎం)ను ఏలూరు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి శుక్రవారం ప్రారంభించారు. ఖాతాదారులు ఏటీఎం సేవలను వినియోగించుకోవాలని, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కోసం మొబైల్ ఏటీఎంను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రస్తుతం ఉన్న రెండు వ్యాన్‌లకు అదనంగా ఈ వ్యాన్ కూడా సేవలందిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మారుమూల గ్రామాల్లోని ఖాతాదారులకు లబ్ధి చేకూర్చడం కోసం మరిన్ని వ్యాన్‌లు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సమావేశాన్ని ఆమె నిర్వహించారు. బ్యాంకుకు గల ఎన్‌పీఏలను తగ్గించి మొండి బకాయిలు వసూలు చేయడం, బ్యాంకును లాభాల బాటలో తీసుకురావడం వంటి విషయాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని రైతులకు పంట రుణాలతో పాటు రైతు నేస్తం, రైతు బంధు రుణ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిలు (పాలకవర్గ సభ్యులు), బ్యాంకు సీఈఓ బి.శ్రీదేవి, నాబార్డు డీడీఎం టి.అనిల్‌కాంత్, బ్యాంకు సీనియర్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిరగాలపల్లి సర్పంచ్ రాజీనామా

యలమంచిలి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో శిరగాలపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి, మరికొందరు పంచాయతీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ పి.శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావుచౌదరి మాట్లాడుతూ తాను సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన మూడేళ్లలో గ్రామంలో సుమారు రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని, సంక్షేమ పథకాల రూపంలో మరిన్ని కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమయ్యాయన్నారు. ఇంత అభివృద్ధి, సంక్షేమం అందజేసినా వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఓట్లేయకపోవడంతో నైతిక బాధ్యతగా పంచాయతీ పాలకవర్గ సభ్యులతో చర్చించి రాజీనామా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆయనతో పాటు 1వ వార్డు సభ్యుడు వీరవల్లి నరసింహమూర్తి, 3వ వార్డు సభ్యుడు ముస్కుడి మణి, 5వ వార్డు సభ్యుడు సజ్జా శ్రీనివాస్, 9వ వార్డు సభ్యుడు వల్లూరి ఎస్‌ఆర్‌వీ సత్యనారాయణశర్మ, 10వ వార్డు సభ్యుడు తమ్మినీడి సుబ్బలక్ష్మి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాతకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు, ఆర్‌ఐ నాగరాజు ఉన్నారు.

నేటి నుంచి మావుళ్లమ్మ జాతర



మావుళ్లమ్మవారు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారి జ్యేష్ఠ మాస జాతర మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 5వ తేదీ వరకు జాతరను ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారి వార్షిక మహోత్సవాలు తర్వాత ఎక్కువ రోజులపాటు జరిగే వేడుక ఇదే. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేశారు. దేవస్థాన సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ మాట్లాడుతూ తొలిరోజు అమ్మవారిని నిలబెట్టడం, ఈనెల 21 నుంచి 29 వరకు అమ్మవారికి నగర వీధుల్లో గ్రామోత్సవాలు నిర్వహించడం, ఈనెల 13న గవళ్ల గడుపు సేవ, 27న అమ్మవారి నగర ఉత్సవం జాతర మహోత్సవం, 3న నైవేద్యాల సమర్పణ, 4న ఊయల సేవ అలాగే ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

● జగన్‌ను కలిసిన నౌడు



భీమడోలు: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, పార్టీని సంస్కరించి సరైన రీతిలో గాడిలో పెట్టి నడిపించేందుకు పార్టీ అధ్యక్షుడిగా ఏ నిర్ణయం తీసుకున్నా మేమంతా కట్టుబడి ఉంటామని జగన్‌తో తాను అన్నట్టు చెప్పారు. తనకు ఏ బాధ్యతను అప్పగించినా సక్రమంగా నిర్వహిస్తానని జగన్‌తో చెప్పానన్నారు. పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని, పార్టీ కేడర్ మనోధైర్యంతో ముందుకు సాగాలని నౌడు వెంకటరమణ కోరారు.

కలెక్టర్‌కు ఎన్జీవోస్ అభినందనలు



ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్‌జీవోస్ నాయకులు

ఏలూరు(మెట్రో): కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను శుక్రవారం ఏపీ ఎన్‌జీవోస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసినందుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావులు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా వివిధ కారణాలతో సస్పెండ్ అయిన ఉద్యోగులను, ఉపాధ్యాయులను, ఇతర సిబ్బందికి సంబంధించిన సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. త్వరలో సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఏలూరు తాలూకా అధ్యక్షుడు ఎ.శ్రీధర్‌రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, ఇతర ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

స్టెనోగ్రాఫర్ పోస్టులకు దరఖాస్తులు

కైకలూరు: కృష్ణా జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్ (పర్సనల్ అసిస్టెంట్) మూడు పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కృష్ణా జిల్లా జెడ్జి తెలిపారు. నెలకు రూ.18,500 వేతనం అందిస్తామన్నారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ అర్హత , టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్‌లో హయ్యర్ గ్రేడ్ కలిగి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్‌లో హయ్యర్ గ్రేడ్ అర్హత లేకుంటే, ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్‌లో లోయర్ గ్రేడ్ అర్హత ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. జూలై 1, 2024 నాటికి వయసు 18 నుంచి 42 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు వారికి ఐదేళ్లు, విభిన్న ప్రతిభావంతులు, మాజీ సైనికోద్యోగులకు పదేళ్ల వయసు సడలింపు ఉంటుందన్నారు.

'ఓపెన్' పరీక్షలకు 940 మంది..


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల సప్లిమెంటరీ పరీక్షలకు శుక్రవారం 940 మంది హాజరయ్యారు. టెన్త్ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పరీక్షకు 552 మందికి 453 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ భౌతికశాస్త్రం పరీక్షకు 346 మందికి 306 మంది, రాజనీతి శాస్త్రం పరీక్షకు 201 మందికి 181 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.



దుక్కు దున్నిన పొలం

మేఘమా.. వర్షించుమా

- పదునెక్కని పొలాలు
- ఊరిస్తున్న మేఘాలు
- కొన్నిచోట్ల అరకొర వర్షం
- రైతుల ఎదురుచూపులు



ఊరిస్తున్న మబ్బులు

పెదవేగి: వానమ్మా.. ఓసారి వచ్చి పోవమ్మా.. మేఘమా.. వర్షించుమా అంటూ అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మేఘాలు కనిపిస్తున్నా కొద్దిపాటి జల్లులు మాత్రమే కురుస్తున్నాయి. వారం క్రితం కొన్నిచోట్ల భారీ వర్షం కురిసినా పొలాలు పూర్తిస్థాయిలో పదును కాలేదు. కురిసిన చోట అరపదును కావడం, మరికొన్ని చోట్ల అదీ లేకపోవడంతో రైతులు వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. పొలాలు పదును కాకుండానే దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు కురిసి భూములను దున్నిన ప్రాంతాల్లో గొర్రు తోలి విత్తుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయా ప్రాంతాల్లో మరోమారు భారీ వర్షం కురిస్తేనే విత్తనాలు నాటేందుకు వీలుంటుంది. కొన్నిచోట్ల గతంలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు విత్తనాలు నాటగా ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో విత్తనాలు నేలలో మగ్గి మొక్క మొలవకుండా పాడవుతున్నాయి. దీంతో వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

సాగు చేయాలా.. వద్దా.. ఉమ్మడి జిల్లాలో ఒక గ్రామంలో వర్షం ఉంటే మరో గ్రామంలో వర్షం ఉండటం లేదు. దీంతో అధిక నీరు అవసరమైన పంటల సాగుకు రైతులు అయోమయంలో ఉన్నారు. ప్రస్తుతం వరి నారు పోసుకునే పరిస్థితి. నారు పోస్తే వర్షాలు పడి బోర్లలోకి నీరు వస్తాయో లేదోనని అయోమయంలో రైతులు ఉన్నారు. ఒక వేళ బోర్లలో నీరు రాకుంటే అధిక పెట్టుబడులు పెట్టి రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. దీంతో కొందరు రైతులు అధిక నీటితో అవసరమైన పంటలకు దూరమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పశ్చిమ గోదావరి జిల్లాలో 2.32 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 1.83 లక్షల ఎకరాల్లో వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

క్లుప్తంగా

ఐసీఏఆర్‌కు జీడిమామిడిపై నివేదిక



జీడిమామిడి పంటల నివేదికను ఐసీఏఆర్‌కు అందచేస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: జీడిమామిడిపై 2018 నుంచి 2023 వరకు జరిగిన పరిశోధనల వివరాలను జాతీయ జీడిమామిడి పరిశోధనల సమీక్ష కమిటీ చైర్మన్, ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీ రామ్ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్‌కు శుక్రవారం ఢిల్లీలో సమర్పించారు. రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన జీడిమామిడి మొక్కల సరఫరా, జాతీయ సగటు హెక్టారుకు 750 కిలోల దిగుబడి ఉండగా, రాష్ట్రంలో హెక్టారుకు 2000 కిలోలు దిగుబడి సాధించేలా చూడటం, జీడిమామిడి నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం వంటి వాటిని పరిశోధించామన్నారు. శ్రీకాకుళం జిల్లా పెద్దపేట, పరిశోధన స్థానంలో కోర్ కలెక్షన్ సెంటర్ ఏర్పాటు, మూడు దశాబ్దాలుగా సేవలందిస్తున్న బాపట్ల జీడిమామిడి పరిశోధనా స్థానానికి జాతీయస్థాయిలో అవుట్ స్టాండింగ్ గ్రేడ్ ఇవ్వడం వంటి విషయాలను నివేదికలో పొందుపర్చామన్నారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



సరిపల్లె సీపీఎఫ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గణపవరం : లాభాల బాటలో ఉన్న గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీని కంపెనీ యాజమాన్యం అన్యాయంగా మూసివేసి ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని, కంపెనీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ఉద్యోగులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. కంపెనీ గేటు వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీని మరిచిపోయి అన్యాయం చేశారని విమర్శించారు. తమకు న్యాయం చేయాలని, పరిహారం చెల్లించాలని వారు నినాదాలు చేశారు.

కొబ్బరి చెట్టు నుంచి పడి వ్యక్తి మృతి

చాట్రాయి: కొబ్బరి చెట్టు ఎక్కి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నరసింహరావుపాలెంలో జరిగింది. గ్రామానికి చెందిన పరసా ఏసు(50) శుక్రవారం కొబ్బరి బొండాలు కోయడానికి చెట్టు ఎక్కాడు. కొబ్బరి మట్ట మీద కూర్చుని కాయ కోసి తాగుతుండగా కొబ్బరిమట్ట కిందకు జారడంతో చెట్టు కింద ఉన్న బండ మీద పడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.

కడలిని కాపాడుకుందాం

- నేడు ప్రపంచ సాగర పరిరక్షణ దినోత్సవం
- మత్స్యసంపదకు ప్రమాదకరంగా చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు

మొగల్తూరు : మానవుడి స్వార్థం కడలిని కబళిస్తోంది. ఇష్టానుసారం వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టడంతో జీవజాతి ముప్పు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఏటా జూన్ 8న ప్రపంచ మహాసముద్ర దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1992లో బ్రెజిల్‌లోని రియోడిజనిరోలో జరిగిన ధరిత్రి సదస్సులో సముద్రాలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని ఏటా జరుపుకోవాలని నిర్ణయించారు. సముద్రాలు చెత్తా చెదారాలతో నిండిపోతున్నా, పర్యావరణానికి ముప్పుగా మారినా.. ప్రపంచ దేశాలు చూసి చూడనట్టు వ్యవహరించడంతో సాగరాన్ని రక్షించుకోవాలని నిర్ణయించారు. సముద్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల 2050 నాటికి దాదాపు 40 శాతం చేపల జాతులు అంతరిస్తాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అప్పటికి సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా ఉంటాయని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 19 కిలోమీటర్ల తీర ప్రాంతం

నియోజకవర్గంలో 19 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాతో పాటు కృష్ణా జిల్లా నుంచి వచ్చే డ్రెయిన్‌లు, ఉప్పుటేరు కలుషిత నీరంతా పేరుపాలెంలోని ముఖద్వారం ద్వారా సముద్రంలోకి చేరుతుంది. దీంతో సముద్రం కాలుష్యం పెరుగుతోంది. నియోజకవర్గంలోని వేటపై సుమారు 1000 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు. సముద్ర ఉత్పత్తులు తగ్గిపోవడంతో వేటే ఆధారంగా జీవించే తాము సరైన ఆదాయం లేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎప్పుడులేని విధంగా అలల ఉధృతి పెరిగి గ్రామాలు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. నరసాపురం మండలం చినమైనవానిలంక, బియ్యపుతిప్ప గ్రామాల్లో సముద్రం దాదాపు మూడు కిలోమీటర్లు ముందుకు చొచ్చుకురావడంతో సరుగుడు, కొబ్బరి తోటలు కనుమరుగయ్యాయి.



పేరుపాలెం బీచ్

ఆహ్లాదపరుస్తున్న పేరుపాలెం బీచ్

జిల్లాలోని కేపీపాలెం, పేరుపాలెం బీచ్ ప్రాంతాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఏటా కార్తీక మాసంలో లక్షలాది మంది సందర్శకులు బీచ్‌ను సందర్శించి పుణ్య స్నానాలు చేస్తారు. నిత్యం సందర్శకుల రాకతో పేరుపాలెం బీచ్ చెత్తాచెదారాలతో నిండిపోతోంది. పర్యావరణ వేత్తలు, ప్రజాప్రతినిధులు స్పందించి పేరుపాలెం బీచ్‌ను కాలుష్య రహిత బీచ్‌గా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌గా నామకరణం చేసిన కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయకుండా గట్టి పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి.

– కర్రి ఏసుబాబు, పేరుపాలెం

సముద్ర ఉత్పత్తులు తగ్గాయి



వేకువజామున బయలుదేరి రోజుల తరబడి సముద్రవేటలో ఉంటున్నా అనుకున్నంత మత్స్యసంపద లభించడం లేదు. సముద్రపు నీరు కాలుష్యం బారిన పడటంతో మత్స్య సంపద అంతరించిపోయే పరిస్థితి ఏర్పడింది.

– గాడి రాముడు, మోళ్లపర్రు

వలలకు చిక్కని మత్స్యసంపద



సుమారు 50 మంది మత్స్యకారులు కలిసి ఒకే ఐలు వలతో సముద్ర వేట చేసేవారు. గతంలో ఐలు వలకు లక్షలాది రూపాయల మత్స్యసంపద చిక్కేది. ఇప్పుడు వేలాది రూపాయలు రావడం గగనంగా మారింది. దీనికి కారణం సముద్రంలో మారుతున్న మార్పులే..

– తిరుమాని బాపూజీ, దారితిప్ప

కాలుష్యం నుంచి రక్షించాలి



కాలుష్యం బారిన పడుతున్న సముద్రాలను రక్షించాలి. పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు సముద్రాల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలి. అంతరించిపోతున్న మత్స్యసంపద కాపాడేందుకు కృషిచేయాలి.

– శంకరపు శ్రీనివాసరావు, మోళ్లపర్రు

వాసవీలో డేటా సైన్స్ కోర్సు



వాసవీలో కొత్త కోర్సుల గురించి వివరిస్తున్న పాలకవర్గ బాధ్యులు

తాడేపల్లిగూడెం: వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి సీఎస్‌ఈలో డేటాసైన్సు కోర్సును ప్రారంభిస్తున్నట్లు పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి నుంచి అనుమతి వచ్చిందన్నారు. 60 సీట్లతో ప్రారంభిస్తున్న ఈ కోర్సులకు మంచి ఆదరణ ఉందన్నారు. ప్రస్తుతం కళాశాలలో సీఎస్ఈలో ఉన్న 240 సీట్లకు అదనంగా 60 సీట్లు వచ్చాయన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో ప్రస్తుతమున్న 180 సీట్లకు అదనంగా 60 సీట్లు , పాలిటెక్నిక్ విభాగంలో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో అదనంగా 60 సీట్లు మంజూరయ్యాయన్నారు. అదనపు సీట్లకు కావాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు, అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్ అందించాలనే లక్ష్యంతో కొత్త కోర్సులు తీసుకొస్తున్నామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కోట్ల వెంకట రామకృష్ణారావు, కోశాధికారి పేరూరి బాలకాశయ్య, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు, ప్రిన్సిపాల్ రత్నాకరరావులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం కోసం సహకరించాలి

డీఎస్పీ డి.మేరీ ప్రశాంతి



జంగారెడ్డిగూడెం: భావోద్వేగాలు అదుపులో ఉంచుకుని, ప్రశాంత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముందు, తరువాత, కౌంటింగ్ అనంతరం చిన్న చిన్న సంఘటనలు మినహా ఏలూరు జిల్లా మొత్తం ప్రశాంతంగా ఉందన్నారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడేందుకు హోంగార్డ్, పోలీసుల నుంచి ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలు ఇలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించారన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు సహకరించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బందితో ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల్లో ఒకరు గెలవడం, మరొకరు ఓడిపోవడం సహజమని.. అయితే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే సమయంలో కూడా సంయమనంతో వ్యవహరించాలన్నారు. వ్యక్తిగత దూషణలు, గొడవలు రెచ్చగొట్టడం వంటి పోస్టులపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే రౌడీషీట్‌లు ఓపెన్ చేయడమే కాకుండా, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ కార్యాలయం, పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే కాటేస్తాయ్!

- వర్షాకాలంలో పాముల బెడద
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదాలు

బుట్టాయగూడెం: వర్షాకాలం ప్రారంభమైంది. ఈ కాలంలో పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని సరిహద్దు గ్రామాల్లో, దట్టమైన పొదల సమీపంలో పాములు తరచూ కనిపిస్తూనే ఉంటాయి. రైతులు పొలాలకు నీరుపెట్టేందుకు వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. ఈ సమయంలో అప్రమత్తంగా లేకపోతే పాముల రూపంలో కాలయముడు కాచుకుని ఉంటాడు. గత వారం రోజుల్లో పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో గల ప్రభుత్వాస్పత్రుల్లో వర్షాకాలంలో పాము కాటు కేసులు నమోదవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. అదేవిధంగా మండ్రకప్ప, తేలు కాటుకు గురై పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకూ పాములు, ఇతర విష కీటకాల బెడద ఉంటుంది. వీటి బారిన పడకుండా తప్పించుకోవడానికి అప్రమత్తతే ప్రధానమని వైద్యులు తెలుపుతున్నారు.

అన్ని పాములతో ప్రమాదం లేదు

మనకు కనిపించే అన్ని పాములు విషపూరితం కాదని వైద్య నిపుణులు అంటున్నారు. నాగుపాము, కట్లపాము, రక్తపింజర వంటి పాముల వల్లనే ప్రమాదం ఉంది. సాధారణంగా 50 శాతంపైగా పాముల వల్ల ఎటువంటి ప్రమాదం ఉండదని వైద్యులు చెబుతున్నారు. పాము కాటు వేసిన వెంటనే సకాలంలో వైద్యం చేయించుకుంటే ఎలాంటి సమస్య ఉండదని అంటున్నారు.



నాగుపాము



రక్త పింజర



కట్లపాము

రక్తపింజర

ఇది ఎక్కువగా అటవీప్రాంతంలో తిరుగుతుంటుంది. ఈ పాము కాటు వేస్తే 2 గంటల తర్వాత విషం శరీరానికి ఎక్కుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తపింజర కాటువేసిన వెంటనే విషాన్ని తొలగించేందుకు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆస్పత్రులకు తీసుకువెళ్ళి వైద్యం అందించాలని, వైద్యుల పర్యవేక్షణలో పాముకాటుకు గురైన వ్యక్తిని ఉంచాలని వైద్యులు సూచిస్తున్నారు.

నాగుపాము

నాగుపాము అత్యంత ప్రమాదకరం. ఈ పాము కాటువేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కువగా ఎక్కుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. నాగుపాము విషం ప్రధానంగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు తెలుపుతున్నారు.

కట్లపాము

కట్లపాము కాటు వేసిన వెంటనే విషం రక్తంలో కలుస్తుంది. ప్రాణాపాయం ఎక్కువ. పాము కాటు వేసిన వెంటనే ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించాలి. కట్లపాము విషం రక్తంలోకి చేరకముందే వైద్యం చేయిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- పాము కాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.
- పాము కాటు వేయగానే గాయాల పైభాగంలో కట్టుకట్టాలి. కొత్త బ్లేడుతో కాటు వేసిన చోట కొద్దిగా చర్మాన్ని తొలగించి రక్తాన్ని నోటితో లాగివేయాలి. నోట్లో గాయాలు ఉన్నవారు ఇలా చేయకూడదు.
- ఏ పాము కాటు వేసిందో తెలుసుకొని యాంటీ వీనమ్ తీసుకోవాలి.
- రైతులు రాత్రిపూట పొలాలకు వెళ్ళేప్పుడు కాళ్ళకు చెప్పులు, టార్చిలైట్లతో పాటు శబ్దాలు చేసే పరికరాన్ని వెంట తీసుకుని వెళ్ళడం వల్ల పాముకాటు నుంచి రక్షించుకోవచ్చు.

ఆందోళన చెందాల్సిన పనిలేదు



పాముకాటు వేస్తే ఆందోళన చెందాల్సిన పనిలేదు. పాము కాటు నుంచి రక్షించుకునేందుకు అప్రమత్తత అవసరం. పాముకాటుకు గురైతే యాంటీవీనమ్ మందులు అన్ని ప్రాథమిక కేంద్రాల్లో ఉంటాయి. కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలి.

– జి. సురేష్, డాక్టర్, ఇన్‌చార్జి డీఎంవో, పులిరామన్నగూడెం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

భీమవరం : భీమవరం పట్టణంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం చెప్పారు. భీమవరం పట్టణం చినరంగనిపాలెంకు చెందిన పెనుగొండ శ్రీను(37), వీరవల్లి శ్రీనివాస్(30) గురువారం రాత్రి 11 గంటల సమయంలో పీపీ రోడ్డులో మోటారుసైకిల్‌పై వెళ్తుండగా పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామానికి చెందిన వ్యక్తి మోటారు సైకిల్‌పై ఎదురుగా వస్తున్నాడు. సెయింట్ మేరీస్ స్కూల్ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో పెనుగొండ శ్రీను అక్కడికక్కడే మృతిచెందగా వీరవల్లి శ్రీనివాస్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పెన్నాడకు చెందిన వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. మెరుగైన వైద్యం కోసం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు చెప్పారు. మృతదేహాలకు భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పొరపాటున పురుగుల మందు తాగి సైనికుడి మృతి



సైనికుడు హేమంత్ మృతదేహం వద్ద రోధిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు, ఈతకోట హేమంత్‌కుమార్ (ఫైల్)

పెదవేగి: పురుగుల మందు కలిపిన నీరు తాగి ఓ సైనికుడు మృతి చెందిన ఘటన పెదవేగి మండలం కూచింపూడిలో జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈతకోట హేమంత్ కుమార్(36) ఢిల్లీలోని సైనికుడిగా పని చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం వారి పొలలంలో పురుగుల మందు పిచికారి చేయించారు. ఆ సమయంలో హేమంత్ దాహం కావడంతో సమీపంలో ఉన్న ఒక సీసాలో ఉన్న నీరు తాగాడు. ఆ సీసాలో పురుగుల మందు వేసి పొలంలో పిచికారి చేశారు. ఆ తరువాత సీసాలో నీరు పట్టి ఉంచారు. విషయం తెలియని హేమంత్ సీసాలో ఉన్న నీటిని తాగాడు. కొద్దిసేపటికి అస్వస్థతకు గురికావడంతో బుధవారం సాయంత్రం ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హేమంత్ గురువారం సాయంత్రం మృతి చెందాడు. శుక్రవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా.. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య శివాణి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆర్మీ సిబ్బంది నివాళులు అర్పించారు.

డ్రైవర్‌పై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

తణుకు: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 6న భీమవరం నుంచి తణుకు వస్తున్న బస్సులో మద్యం మత్తులో ఉన్న నాగేశ్వరరావు డ్రైవర్ మేడపాటి రాజుపై దాడి చేశాడు. పైడిపర్రు సెంటర్ వద్దకు బస్సు వచ్చే సరికి నాగేశ్వరరావు అనుచరులు అర్జున్, పసుపులేటి నాగేశ్వరరావు సైతం బస్సులోకి చొరబడి డ్రైవర్ రాజుతోపాటు కండక్టర్‌పైనా దాడి చేసి గాయపరిచారు. డ్రైవర్ రాజు ఫిర్యాదు మేరకు నిందితులపై శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ వెల్లడించారు.

పాఠశాలలను సిద్ధం చేయండి



ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చిస్తున్న డీఈఓ అబ్రహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో పాఠశాలల పునఃప్రారంభానికి సమయం దగ్గర పడుతుండడంతో పాఠశాలలను సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ఆయన ఏర్పాటు చేసిన కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పాఠశాలలు తిరిగి తెరిచే నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలలనూ సౌకర్యవంతంగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీటి సౌకర్యం, తరగతి గదుల్లో వెంటిలేషన్, లైట్లు వెలిగేలా చేయడం ఫ్యాన్లు తిరిగేలా చేయడం వంటివన్నీ పూర్తి చేయాలన్నారు. మొదటి వారంలో విద్యార్థుల హాజరు శాతాన్ని గమనించాలని, డ్రాపవుట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే బడి మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలలకు రప్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పాటు ప్రారంభం నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యావసర వస్తువులు అందించేలా కృషి చేయాలన్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా పాఠశాలల పాయింట్లకు ఆయా వస్తువులను పంపామని తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్, పీఆర్‌టీయూ, డెమొక్రటిక్ పీఆర్‌టీయూ, ఎస్‌టీయూ, బీటీఏ తదితర ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాత్రి పూట పోలీసు గస్తీ



ఏలూరు కొత్త బస్టాండ్ వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఇతర రహదారుల మార్గాలలో రాత్రి పూట పకడ్బందీగా గస్తీ విధులు, రహదారి ప్రమాదాల నివారణ కోసం రాత్రి పూట వాహనదారులకు ఫేస్ వాష్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి పూట గస్తీ విధులు జిల్లా పోలీసులు పటిష్టంగా నిర్వహించారు. అధికారులు సరిహద్దు ప్రాంతాలలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. రాత్రి వేళల్లో లాడ్జీలు, రైల్వే, బస్సు స్టేషన్లలో కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి నేరాలు జరగకుండా పోలీసులు గస్తీ తిరుగుతూ నేర నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు.

ఇద్దరిపై కేసులు నమోదు

ఆకివీడు : మండలంలోని సిద్ధాపురంలో పంట బోదె విషయంలో రెండు వర్గాల మధ్య ఈ నెల ఆరో తేదీన జరిగిన ఘర్షణలో ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై బీ.నాగబాబు చెప్పారు. ఆకివీడుకు చెందిన గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, ఏరిచర్ల ఏసురత్నం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కామవరపుకోట మండలంలో..

కామవరపుకోట : మండలంలో స్థానిక కొత్తూరు బస్టాండ్ ఎదురుగా గ్రామస్తులతో ఎస్పీ మాట్లాడారు. గ్రామాల్లో రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా, సోషల్ మీడియాలో పోస్టులు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలో కిన్నెర వెంకన్న అనే వ్యక్తిపై హత్యాయత్నానికి ప్రయత్నించిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకన్న ఇంటికి వెళ్ళి హత్య చేసేందుకు ప్రయత్నించిన పామర్తి నాగరాజు, తుమ్మరాడ సాయిరాం, మురాల నాగబాబుపై కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితులను అరెస్టు చేసి భీమవరం కోర్టులో హాజరుపర్చారు. వారికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా నిందితులను నర్సాపురం సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

ముమ్మరంగా ఖరీఫ్ నారుమళ్లు


మోదుగ గుంట గ్రామంలో మాగ దమ్ము చేస్తున్న దృశ్యం


పుల్లాయగూడెం గ్రామంలో నాట్లు వేస్తున్న దృశ్యం

- చల్లబడిన వాతావరణం
- 302 హెక్టార్లలో నారుమడి
- బోర్ల కింద నాట్లు వేస్తున్న రైతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఖరీఫ్ దుక్కులు, నాట్లు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో నాట్లు వేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయన్న నమ్మకంతో రైతులు సాగు పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే 302 హెక్టార్లలో వరి నారుమడి పోశారు. బోర్ల కింద నారుమడి పోసి 21 రోజులు పూర్తి కావడంతో పుల్లాయగూడెం, కృష్ణాపురం, ఎల్.అగ్రహారం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, కడియద్ద తదితర గ్రామాల్లో నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రధానంగా పీఆర్‌పీ-126 రకం వరి వంగడాన్ని వేస్తున్నారు. మెట్ట ఉప్పరగూడెం, మాధవరం, మోదుగ గుంట, దండగర్ర తదితర గ్రామాల్లో మాగ దమ్ములు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో నాట్లు పడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ముందస్తు సాగు చేపట్టడం ద్వారా ప్రకృతి విపత్తుల నుంచి గట్టెక్కవచ్చని వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతాంగం ఖరీఫ్ సాగు పనులను ముమ్మరం చేశారు.

సాగు పనులు చేపట్టాలి



కాలువ కింద గ్రామాల్లోని రైతాంగం ఈ నెల 12వ తేది నుంచి ఖరీఫ్ నారుమడి పోసుకోవాలి. ఆలస్యమయ్యే కొద్ది పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడే అవకాశం ఉంది. సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాలద్వారా అందుబాటులో ఉన్నాయి.
– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

విద్యార్థినికి అభినందనలు


సుశ్మితకు ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మరపట్ల సుశ్మిత త్రీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఏపీ నిట్‌లో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ కనబర్చినట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆమెకు కార్తికేయ శర్మ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థిని సుశ్మితను హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కుళాయిల్లో మురుగునీరు

నరసాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొంత కాలంగా కుళాయిల నుంచి మురుగునీరు వస్తోంది. 30, 31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేయకుండా మంచినీటిని కుళాయిల నుంచి సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


రామాలయంలో పూజలు చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం పడాల గోశాలకు ట్రాక్టర్ గడ్డి, దాణా అందజేశారు. అదే విధంగా బ్యాంక్ కాలనీలోని నూతనంగా నిర్మించిన రామాలయానికి రూ 25,116 విరాళం అందజేశారు. దాతలు మదన్మోహన్ అగర్వాల్, అనిత అగర్వాల్, అమ్రిత అగర్వాల్ సహకరించారు. రామాలయంలో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో పదం కుమార్‌గుప్తా, సుంకర శ్రీనివాసరావు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, పేరూరి కాశియ్య, డాక్టర్ ఎల్ ఎస్‌వీ నాగేశ్వరరావు, ఎస్‌వీ రమణారావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు


రాధాకృష్ణను కలిసి అభినందనలు తెలియజేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

తణుకు: తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను శుక్రవారం పలువురు అభినందించారు. తణుకు పట్టణంలోని ఉమ్మడి కార్యాలయంలో ఎమ్మెల్యే రాధాకృష్ణను కలిసిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాలకు చెందిన నేతలు, వైద్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పోలీసులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జిల్లా దిశ డీఎస్పీ సున్న మురళీ కృష్ణ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డిపో మేనేజర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో సురక్షితమని, ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆర్టీసీ లక్కీ డిప్‌లో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణీకులకు ప్రోత్సాహక బహుమతులు శుక్రవారం అందజేశారు. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లులో ఈ లక్కీడిప్ 15 రోజులకొకసారి నిర్వహిస్తుండగా దాతల సహాయ సహకారాలతో విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సీఆర్‌సీ విజయకుమార్, ప్రయాణీకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్.అగ్రహారంలో 104 వైద్య సేవలు


ఎల్.అగ్రహారం గ్రామంలో రోగులకు మందులు అందజేస్తున్న డాక్టర్ రూపాదేవి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో శుక్రవారం 104 వైద్య సేవల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రూపాదేవి గ్రామంలోని రోగులకు సుగర్, బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కిడ్నీ, పక్షవాతంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దాదాపు 60 మందికి వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ లక్ష్మణరావు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం ఎస్.గంగాదేవి, ఎంపీహెచ్ఏ జి.రాధాకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ డి.వరలక్ష్మి, ఆశా కార్యకర్త సత్యవతి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ధర్మ ప్రచారం

యలమంచిలి: సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రజలకు వివరించడానికి ఈ నెల 10 నుంచి ఇంటింటికీ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ మన్నే కుమారస్వామి తెలిపారు. స్థానిక కేశవస్వామి ఆలయంలో ఇంటింటికీ ధర్మ ప్రచారం కరపత్రాలను సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులతో కలసి శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మంలో ఉన్న కులాల ఆవిర్భావం, వాటి విశిష్టత, కులవృత్తుల గురించి అవగాహన కల్పించడమే ఈ ధర్మ ప్రచారం ప్రధాన ధ్యేయమన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


తణుకులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తే వ్యాధులను నివారించుకోవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని మల్లికాసులపేట, 2వ వార్డు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే, జాతీయ మలేరియా వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మలేరియా వ్యాధిపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చలి, వణుకుతో కూడిన జ్వరం ఉంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యులకు చూపించుకోవాలని సూచించారు. దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా వ్యాధికి సొంత వైద్యం చేయరాదని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఒంటిని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేసుకోవాలని, నిద్ర సమయంలో దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వారానికోసారి ఇంటి ఆవరణ శుభ్రం చేసుకుంటే దోమ కాటు నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. ఈసందర్భంగా అవగాహన కోసం ర్యాలీ నిర్వహించి స్థానిక నివాసితులకు జాగ్రత్తలు తెలిపే కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు కె.అనూషా సువర్ణ, బి.వెంకట రమణ, కె.వెంకటలక్ష్మి, డి.సూర్యకుమారి పాల్గొన్నారు.

భవిత కేంద్రం సేవలను వినియోగించుకోవాలి


కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు బాల ఈశ్వరయ్య

తాడేపల్లిగూడెం రూరల్: దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాల్లో అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే. బాల ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రం.2లో దివ్యాంగ చిన్నారుల గుర్తింపుపై కరపత్రాల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రతీ బుధవారం ఫిజియోథెరపీ పరీక్షలు చేస్తారని, తద్వారా చిన్నారుల ప్రవర్తనలో మార్పు వస్తుందన్నారు. ఏఎన్ఎం సుభాషిణి మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమలను నివారించవచ్చన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే. శ్రీదేవి మాట్లాడుతూ గర్భవతులు ఆరోగ్యవంతమైన శిశువుల కోసం ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. ఆహారంలో మినుములు, జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజర్ బాబ్జీ, ఆశా వర్కర్లు లక్ష్మీనారాయణమ్మ, పి.నాగమణి, అంగన్‌వాడీ టీచర్ పి.కనకదుర్గాంబ, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బొలిశెట్టి


జిల్లా కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను భీమవరంలోని ఆయన కార్యాలయంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలపై ఆయన కలెక్టర్‌తో చర్చించారు.

టిడ్కో ఇళ్లపై సమీక్ష

అర్హులకు త్వరలో టిడ్కో ఇళ్లను అప్పగించాలని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులను కోరారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు.

మునిసిపల్ కార్యాలయ సందర్శన

మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ ఇక్కడ పని చేసే ప్రతీ ఉద్యోగి నీతి, నిజాయతీతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్ష చేశారు. మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొలిశెట్టిని కలిసిన కమిషనర్ మురళీ

తాడేపల్లిగూడెం అర్బన్: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ డి మురళీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పలు విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులకు సత్కారం


మండపాకలో వ్యవసాయాధికారి, ఎంవీఐలను సత్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

తణుకు టౌన్: మండలంలో ధాన్యం కొనుగోలును విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా తణుకు మండలం మండపాక గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జీ సంజీవ్‌కుమార్‌లతో పాటు రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బలుసు కేశవరావు, చుండ్రు గణేష్, పరిమి శివరావు, యలమాటి రాఘవులు, ఇతర రైతులు మండల వ్యవసాయాధికారి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఆర్‌బీకే సిబ్బంది ఎస్ అయ్యప్ప, పీ సంపత్ తదితరులను సత్కరించారు.

నేర్చుకోవడం విద్యార్థుల ఉత్తమ లక్షణం


వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో వక్తలు

ఉండి: ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పే ప్రతీ విషయాన్ని విని నేర్చుకోవడం విద్యార్థులకు ఉండాల్సిన ఉత్తమ లక్షణమని యండగండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ అన్నారు. శుక్రవారం యండగండి శాఖా గ్రంథాలయంలో 24 రోజులు నిర్వహించిన వేసవి శిక్షణ ముంగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం, యవ్వనంలోనే నేర్చుకొని, చదవుకునే అవకాశం లభిస్తుందని, సద్వినియోగం చేసుకున్నప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతామన్నారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా, చదువును నిర్లక్ష్యం చేయకుండా మంచి ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిరంలో నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్, డిబేట్, పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్‌సీహెచ్ రామకృష్ణ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, గోపాలకృష్ణరాజు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు

ఆకివీడు: పశువుల్లో గొంతు వాపు వ్యాధి నివారణకు ముందు జాగ్రత్త చర్యలతో టీకాలు వేయడం ప్రారంభించినట్లు మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీసత్య తెలిపారు. మండలంలోని అయిభీమవరంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించామని తెలిపారు. తేమ అధికంగా ఉండే ప్రాంతాల్లో వ్యాప్తి చెందే మల్టోసిడా అను సూక్ష్మ జీవుల వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. కళ్లు ఎర్రబడటం, నీరు కారడం, నోటి నుంచి సొంగ కారడం, గొంతు క్రింది భాగంలో నొప్పులతో కూడిన వాపులు కలిగిన లక్షణాలుంటే గొంతువాపు వ్యాధి సంక్రమించినట్లేనన్నారు. వ్యాధి సోకిన పశువులు ఆహారం సక్రమంగా తీసుకోవని, వ్యాధి నిరోధక శక్తి పడిపోతుందని వైద్యురాలు భార్గవి అన్నారు. సరైన వైద్యం అందజేయకపోతే వ్యాధి సోకిన పశువు 48 గంటల్లో చనిపోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ఆయా పశువైద్య కేంద్రాల్లో రైతులు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం

ఆకివీడు: వేసవి సెలవులు విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాయని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు అన్నారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పండు మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు వేసవి సెలవులు ఇస్తారన్నారు. సెలవుల్లో విచ్చలవిడిగా తిరగకుండా కొంతమంది విద్యార్థులు తమ విజ్ఞానాన్ని, మేథస్సును పెంపొందించుకునేందుకు శిక్షణ శిబిరాలకు హాజరు కావడం అభినందనీయమన్నారు. రీడర్స్ ఫోరం అధ్యక్షుడు దాసరి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ పలు అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించి, వారిలో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు శిక్షణలు తోడ్పడ్డాయని తెలిపారు.అనంతరం విద్యార్థులకు బహుమతులు పాల్గొన్నారు. లయన్స్ ప్రతినిధి, అడ్వకేట్ నెలిల సతీష్ కుమార్, ఉపాధ్యాయులు కిషోర్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ పోస్ట్ ద్వారా ప్రజాప్రతినిధులకు అభినందనలు

భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ఈ పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలాశాఖ వినూత్న కార్యక్రమం చేపట్టినట్లు భీమవరం డివిజన్ పోస్టాఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ ఎస్‌వీ సత్యనారాయణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులకు వారి అభిమానులు కేవలం రూ.10 ఫీజుతోపాటు రూ.2 జీఎస్టీ చెల్లించి పోస్టాఫీసులో ఈ పోస్టు ద్వారా శుభాకాంక్షలు పంపొచ్చన్నారు. పోస్టాఫీసుల నెట్‌వర్క్ ద్వారా ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్, ఫిజికల్ డెలివరీ కలయికతో దేశంలోని ఏ చిరునామాకైనా తమ సందేశాలను పంపొచ్చని సత్యనారాయణరాజు వివరించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని పలువురు వక్తలు తెలిపారు. గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్, డిక్షనరీ, ఇంగ్లీషు గ్రామర్ బుక్స్, బహుమతులు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలలోని పుస్తకాలను చదవడం ద్వారా వాటిని సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని కోరారు. గ్రంథాలయాలను ఉపయోగించుకున్నవారు విజ్ఞానవంతులుగాను, ఉన్నత స్థాయికి చేరుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ గరికపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, ఎస్.సత్యం, చంద్రశేఖర్, వి.రామాంజనేయులు, గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


బాధిత కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

తణుకు అర్బన్: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాధిత కుటుంబ సభ్యులకు బిల్డింగ్ వర్కర్స్ జిల్లా యూనియన్ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల కోనసీమ జిల్లా జొన్నాడ మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ తాపీ పనిచేస్తూ హైటెన్షన్ వైర్లు తగిలి భవనం పైభాగం నుంచి కిందకు పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో పశ్చిమ గోదావరి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజమండ్రి వెళ్లి బాధిత కుటుంబానికి రూ. 22వేలు, నెల్లూరు జిల్లా టీపీ కోడూరు మండలం వరిగొండ గ్రామానికి చెందిన పేరం సుబ్బారాయుడు అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో కాలుకి తీవ్ర గాయమైన కారణంగా బాధిత కుటుంబానికి రూ. 9,250లు సంఘం నుంచి ఇవ్వడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ఆదినారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మైలవరపు శ్రీరాం బాబు, కొక్కిరిమెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో తుక్కుతుక్కయిన స్కూటీ

తణుకు: తణుకు పట్టణ పరిధిలో వీరభద్రపురం-తణుకు రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు తణుకు బ్రాంచిలో మేనేజర్‌గా పని చేస్తున్న ఈపు రూపాదేవి శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి బ్యాంకుకు స్కూటీపై వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రూపాదేవి తలకు గాయం కావడంతో తొలుత తణుకులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడకు తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

ఎస్టేట్ ఆఫీసర్ మల్లికార్జునరావుకు ఘనంగా వీడ్కోలు


మల్లికార్జునరావుకు అభినందనలు చెబుతున్న ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): గత రెండున్నర సంవత్సరాలుగా డిప్యూటేషన్‌పై డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఎస్టేట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎంవీ మల్లికార్జునరావు మాతృశాఖ పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఉద్యాన వర్సిటీలో వీడ్కోలు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఉద్యాన ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ హాజరైయారు. మల్లికార్జునరావుకు అభినందనలు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, పరిశోధన సంచాలకులు డాక్టర్ నారమ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమీక్షా సమావేశం

తాడేపల్లిగూడెం: ఎన్నికల ఫలితాలపై పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ హాజరవుతారని, సమావేశానికి పార్టీశ్రేణులు హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

ఇరగవరం: తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇరగవరం మండలం కె ఇల్లిందలపర్రు గ్రామంలో శుక్రవారం విలేజ్ హెల్త్ న్యూట్రీషన్, శానిటేషన్ డే ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా ఐసీడీఎస్ పీడీ బోళ్ల సుజాత రాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రల్లో అందిస్తున్న రేషన్ తీసుకుని వారి పోషణ మెరుగు పరుచుకోవాలన్నారు. రక్త హీనత లేకుండా పోషకాహరంతో శారీరంలో రక్త శాతాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు అందరూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లల నమోదు ఇంటింటికి వెళ్లి చేయాలని తెలిపారు. తణుకు ప్రాజెక్టు పరిధి అధికారిణి ఎంబిఎస్ ప్రమోదిని కుమారి, అదనపు అధికారిణి ఎం ఆశా రోహిణి, సెక్టార్ సూపర వైజర్లు, మాణిక్యాంబ, ఎస్ కాంత కుమారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు భోజనం పొట్లాల పంపిణీ

భీమవరం: ప్రపంచ ఆహార భద్రత దినోత్సవ సందర్భంగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని గొల్లవానితిప్ప రోడ్‌లో పేదకుటుంబాలకు శుక్రవారం భోజనం పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మానవునికి ప్రధాన అవసరాలైన నీరు, ఆహారం వంటివాటి విషయంలో ప్రజలు భద్రతలు పాటించాలన్నారు. ఆహార భద్రత దినోత్సవ సందర్భంగా హర్షిత ఫుడ్స్ సహకారంతో పేద కుటుంబాలకు భోజనాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఇందుకూరి శివాజీవర్మ, వాల్మీకి బాలాజీ, మానవతా సాయి తదితరులు పాల్గొన్నారు.